నిరంతర విద్యుత్ కాంతులు



- చిట్టివలస, తాళ్లవలస సబ్‌స్టేషన్ల పరిధిలో కోతలకు చెక్
- నాణ్యమైన విద్యుత్ సరఫరాతో సర్వత్రా హర్షం

తగరపువలస: గత ప్రభుత్వాల హయాంలో విద్యుత్ సరఫరా గాలిలో దీపాలుగా ఉండేవి. నాసిరకం పనుల కారణంగా తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, వైర్లు తెగిపడటం, స్తంభాలు కూలిపోవడం, రక్షణ చర్యలు పాటించక పోవడంతో ఎక్కువగా విద్యుదాఘాతాలు జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

- జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డులోని చిట్టివలస, భీమిలి మండలం తాళ్లవలస విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వినియోగదారులకు ఈ నాలుగున్నరేళ్లలో నాణ్యమైన సేవలు అందాయి. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు స్తంభాలు, కండక్టర్లు ఆధునికీకరణ, ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ బాక్సులు ఏర్పాటు చేశారు.
- 11 కేవీ తగరపువలస పరిధిలో తక్కువ సామర్థ్యం కలిగిన పాత 34 చదరపు మిల్లీమీటర్ల కండక్టర్ స్థానంలో 55 చదరపు మిల్లీమీటర్ల కండక్టరును మార్చారు. వీటిలో జాతీయ రహదారి వెంట ఉన్న ఎల్‌టీ, హెచ్‌టీ స్తంభాల కండక్టర్లు కూడా ఉన్నాయి. వీటికి రూ.6.40 లక్షలు ఖర్చు చేశారు.
- సంగివలస అనిట్స్ కళాశాల రహదారిలో తక్కువ ఎత్తు అనగా 8 మీటర్ల పొడవైన స్తంభాల స్థానంలో ప్రత్యామ్నాయంగా 11 మీటర్ల పొడవైన స్తంభాలు 13 వేశారు. కండక్టర్లతో సహా వీటికి రూ.6 లక్షలు ఖర్చు చేశారు. 11 కేవీ ఫీడర్ పరిధిలో మరో రూ.3.89 లక్షలు ఖర్చు చేశారు.
- తగరపువలస, చిట్టివలస పట్టణ పరిధిలో 29 చోట్ల కొత్తగా 63 కేవీఏ డీటీఆర్ మార్చడానికి రూ.1.16 కోట్లు ఖర్చు చేశారు.
- భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్ పరిసరాలలో పాత స్తంభాలు, కండక్టర్ల స్థానంలో కొత్తగా 10 స్తంభాలు, కండక్టర్లు మార్చారు. దీనికి రూ.4 లక్షలు ఖర్చు చేశారు.
- చిట్టివలస, సంగివలస, తాళ్లవలసలో శిథిలమైన 90 స్తంభాలతో పాటు పొట్టి స్తంభాలను మార్చడానికి రూ.16 లక్షలు ఖర్చు చేశారు. పాత కండక్టర్లు, ఎల్బీ ఏబీ కేబుల్స్ మార్చడానికి రూ.14 లక్షలు ఖర్చు చేశారు.
- చిట్టివలస సబ్‌స్టేషన్‌లో తుప్పు పట్టిన ఐరన్ స్తంభాలను తొలగించి 11 ఎంటీఎస్ స్పాన్ పోల్స్‌ను రూ.8 లక్షలతో వేశారు.
- తాళ్లవలస 11 కేవీ, 33 కేవీ లైన్‌లో తరచూ జరుగుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అధిగమించడానికి ఎం+12 టవర్లు, కండక్టర్లు మార్చడానికి రూ.3.30 లక్షలు ఖర్చు చేశారు.
- చిట్టివలస, తాళ్లవలస సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రమాదాల నివారణకు 28 డిస్ట్రిబ్యూషన్ బాక్సులు ఏర్పాటు చేశారు.
- తగరపువలస, చిట్టివలసలో ప్రధాన మార్గాలలో ఆరు చోట్ల దిగువ ఉన్న ప్లింత్‌లను ఎత్తయిన ప్లింత్‌లుగా మార్చడానికి రూ.4 లక్షలు ఖర్చు చేశారు.
- తాళ్లవలస, చిట్టివలస సబ్‌స్టేషన్ల పరిధిలో 22 చోట్ల ఏబీ స్విచ్‌లు కొత్తగా ఏర్పాటు చేశారు.
- నమ్మివానిపేటలో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.4 లక్షలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.
- మీ సేవ డౌన్, చిల్లపేట, కొండపేట, ఆంధ్రా బ్యాంకు, వాణీ స్కూల్ ప్రాంతాలలో రూ.7.99 లక్షలతో కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేశారు.
- చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జీవీఎంసీ, భీమిలి మండలంలో రూ.50 లక్షల పైచిలుకు అభివృద్ధి పనులు పూర్తిచేశారు.
- భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీలో 25 ఏళ్లగా ఉన్న లోఓల్టేజీ సమస్యను నవరించడానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడమే కాకుండా ఏడు విద్యుత్ స్తంభాలు వేశారు. దీనికి రూ.3.90 లక్షలు వెచ్చించారు.
- భీమిలి జోన్ బాలాజీనగర్‌లో 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు గజిబిజిగా కలిసిపోయి తరచూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తుండడంతో తక్కువ ఎత్తులో ఉన్న స్తంభాలకు బదులు ఎక్కువ ఎత్తులో విద్యుత్ స్తంభాలు అమర్చారు. దీనికోసం రూ.4 లక్షలు ఖర్చు చేశారు.
- సంగివలస కాలనీలో సుదీర్ఘకాలంగా ఉన్న వైర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతుండంతో రూ.2 లక్షలతో 5 వైర్ల లైన్లను మార్చారు.
- తాటితూరులో పాడైన కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ.2లక్షలు, అమనాంలో 12 స్తంభాల కోసం రూ.4లక్షలు, టి.నగరపాలెంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్, మూలకుద్దు–అన్నవరం పంచాయతీలలో రూ.2.75 లక్షలతో 15 కొత్త స్తంభాలు, బోడమెట్టపాలెంలో రూ.3.70 లక్షలతో 16 కొత్త స్తంభాలు వేశారు. తాళ్లవలస పంచాయతీలో రూ.4లక్షలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వేశారు.
- చిట్టివలసలో రూ.4 లక్షలతో 15 స్తంభాలు, రూ.16 లక్షలతో నాలుగు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చారు.



చిట్టివలస సబ్ స్టేషన్‌లో ఐరన్ స్తంభాలను మార్చి ఏర్పాటు చేసిన 11 ఎంటీఎస్ స్పాన్ పోల్స్





చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు, తగరపువలసలో స్తంభాలు, తీగలు మారుస్తున్న కార్మికులు, సంగివలసలో 11 మీటర్ల స్తంభాల ఏర్పాటు

అనధికార కోతలు లేవు



ఈ నాలుగున్నరేళ్లలో విద్యుత్ సరఫరాలో అనధికార కోతలు లేవు. గత ప్రభుత్వాల హయాంలో ఎప్పుడు సరఫరా ఉండేదో, ఎప్పుడు పోయేదే తెలిసేదే కాదు.

– డి.వి.ఎస్.ప్రసాద్, గ్రామీణ వైద్యుడు, ఆదర్శనగర్

ప్రకృతి కోపించినా వెంటనే పునరుద్ధరణ



ప్రకృతి కోపించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. వెంటనే పునరుద్ధరణ చర్యలు తీసుకుంటున్నారు. శిథిలమైన వైర్లు, స్తంభాలు దాదాపు ఎక్కడా లేవు.

– జల్లు తిరుపతిరావు, ఎల్ఐసీ ఏజెంట్, చిట్టివలస

నాణ్యమైన మెటీరియల్ వినియోగం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నాణ్యమైన మెటీరియల్ కారణంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తప్పాయి. సమస్యలున్నా వెంటనే స్పందిస్తున్నారు.

– చింతగుంట శివ, పెళ్లిళ్ల మధ్యవర్తి, తగరపువలస

క్లుప్తంగా

బాక్సింగ్‌లో బంగారు పతకం



విద్యార్థి వికాస్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు జగన్నాథస్వామి

తగరపువలస: ఈ నెల 19 నుంచి 21 వరకు నగరంలో జరిగిన సీఎం రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో సంతపేటలోని జీవీఎంసీ అంబేడ్కరు హైస్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎల్.వికాస్‌కు బంగారు పతకం లభించింది. 28–30 కిలోల విభాగంలో ఈ మెడల్ లభించినట్టు ప్రధానోపాధ్యాయుడు వైఎస్‌వీవీపీడీ జగన్నాథస్వామి తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు.. వికాస్‌ను కోచ్ వి.ఆదినారాయణను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లకు మరమ్మతులు



దివీస్ సంస్థ మరమ్మతులు చేయించిన పాఠశాల టాయిలెట్లు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలో కొనసవానిపాలెం, అన్నవరం పంచాయతీలోని పైలపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల టాయిలెట్లకు చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.53 వేలతో మరమ్మతులు చేయించింది. ఈ సందర్భంగా వీటిని శుక్రవారం ఆయా పాఠశాలల యాజమాన్యాలకు అప్పగించారు. కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధి ఎ.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ అధికారి దృష్టికి మారు పేరు కార్మికుల సమస్యలు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు మారుపేర్ల కార్మికుల సమస్యలపై ఐక్య కార్యాచరణ సంఘాల ప్రతినిధులు శుక్రవారం నగరంలోని పీఎఫ్ కార్యాలయంలో అధికారి కె.వీరమణికాంత్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం పీఎఫ్ ట్రస్ట్ బోర్డులో బ్యాంకు స్టేట్‌మెంట్ తదితర వివరాలు కోరామన్నారు. దరఖాస్తు చేసిన కార్మికులకు కూడా యాజమాన్యం పీఎఫ్ చెల్లించడం లేదన్నారు. అధికారిని కలిసిన వారిలో జేవీ కైలాస్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందన

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్‌స్కూల్‌కు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల, బాలికల షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పెర్నమిట్ట జిల్లా పరిషత్ పాఠశాల వద్ద జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పద్మనాభం

పద్మనాభం: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా పద్మనాభం సచివాలయ పరిధిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్రికెట్ పోటీలు శుక్రవారం కృష్ణాపురంలో ప్రారంభమయ్యాయి. పోటీలను వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం ప్రారంభించారు. సచివాలయ కార్యదర్శి రఘునాథ్,పీడీ నారాయణమ్మ పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

తగరపువలస: ఏబీవీపీ భీమిలి కమిటీ ఎన్నిక శుక్రవారం చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాలలో జరిగింది. రాష్ట్ర కార్యసమితి సభ్యుడు లొడగల అచ్చిబాబు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సురవరపు సాయికుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. కన్వీనర్‌గా పి.లక్ష్మణ్, మీడియా కన్వీనర్‌గా ఆర్.భరత్‌చంద్ర, స్కూల్ కన్వీనర్‌గా పి.శివశంకర్, హాస్టల్ ఇన్‌చార్జిగా డి.వాసు, కళాశాలల కన్వీనర్‌గా సాయి, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా కె.వంశీ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కె.దేవి, శ్రీను, చరణ్, నాగరాజు, సాయి, దుర్గారావులను ఎన్నుకున్నారు. వీరికి కళాశాల కరస్పాండెంట్ బి.నరసింగరావు శుభాకాంక్షలు తెలిపారు.



నూతన కమిటీ సభ్యులు

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా..

ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుకి చేరేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. నవరత్నాల సంక్షేమ ఫలాలు అందరికీ అందేందుకు మండలాల వారీగా పర్యవేక్షణ అవసరమని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు 11 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలు తెలపాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారులు వీరే...

మండలం	ప్రత్యేకాధికారి	హోదా
పద్మనాభం	జి. సూర్యప్రకాశరావు	జిల్లా పౌర సరఫరాల అధికారి
భీమునిపట్నం	ఎస్. భాస్కరరెడ్డి	ఆర్డీవో, భీమిలి
ఆనందపురం	టి. సీతారామ్మూర్తి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
విశాఖపట్నం రూరల్	జీవీఎస్ఎస్ రామమోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
సీతమ్మధార	చక్రవర్తి	డీపీవో, జీవీఎంసీ
మహారాణిపేట	చంద్రిక	డీపీవో, జీవీఎంసీ
గోపాలపట్నం	పి. శేషశైలజ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ములగాడ	టి. ప్రవీణ	జిల్లా కో–ఆపరేటివ్ అధికారి
గాజువాక	డి. లక్ష్మారెడ్డి	ఎస్టేట్ అధికారి, వీఎంఆర్డీఏ
పెదగంట్యాడ	డాక్టర్ వి.సన్యాసిరావు	అదనపు కమిషనర్, జీవీఎంసీ
పెందుర్తి	డి. హుస్సేన్ సాహెబ్	ఆర్డీవో విశాఖపట్నం

అంచెలంచెలుగా లక్ష్యాలు చేరుకోవాలి

తగరపువలస: ఉద్యోగ అన్వేషణలో ఒక్కసారి అవకాశం చేజారితే దిగులు చెందకుండా ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి అంచెలంచెలుగా ప్రయత్నించి చేరుకోవాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకసారి ఉద్యోగం సంపాదించిన వారు కూడా అక్కడితో ఆగిపోకుండా తమ సామర్థ్యం మేరకు మరో మెట్టు ఎక్కే ప్రయత్నం చేయాలన్నారు. ఈ మెగా జాబ్ మేళాకు 2 వేల మంది హాజరుకాగా 35 సంస్థల ప్రతినిధులు మూడు దశల్లో 435 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. మరో 205 మందిని షార్ట్ లిస్ట్‌లో ఉంచినట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.రమేష్‌నాయుడు, ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్.శ్రీహరి, డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ లీడ్ కార్పొరేటర్ కేవీ సత్యనారాయణరాజు, ప్రిన్సిపాళ్లు మురళీకృష్ణ, జాషువా, రాజు, పిన్నింటి రామకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీనివాసరావు, రూప్ సుందర్, రీసెర్చ్ ప్రిన్సిపాల్ గోవిందరావు, డైరెక్టర్ రాఘవరావు వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల పెదబాబు, యలమంచిలి సూర్యనారాయణ, కొప్పల ప్రభావతి, గాడు వెంకటప్పడు, బోని బంగారునాయుడు, శిల్లా కరుణాకర రెడ్డి, జీరు వెంకటరెడ్డి, కొప్పల రమేష్, చిల్ల గణేష్ రెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు ఎంపిక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

తగరపువలస: భీమిలి పాస్టర్స్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు సంగివలసలో శుక్రవారం ఘనంగా జరిగాయి. అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌కుమార్ కాటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో డైరెక్టర్ బిషప్ మామిడి మోహన్ కుమార్, కుమార్‌రాజు దైవసందేశం అందించారు. కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇంకా యెజ్జల బాలరాజు, గోవాడ ప్రభుదేశాయ్, బర్నబాస్ పట్నాయిక్, జేమ్స్ బిల్లీ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు క్రీడా సామగ్రి



క్రీడా సామగ్రితో కస్తూర్బా విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులకు ఐఎన్ఎస్ కళింగ నేవీ అధికారుల కుటుంబ సభ్యులు క్రీడా సామగ్రిని అందించారు. శుక్రవారం విద్యాలయాన్ని సందర్శించిన వారు మాట్లాడుతూ బాలికలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ సామగ్రిని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేవీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పార్వతి, అమృత, ప్రతిమ ఇతర సభ్యులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఆహ్వానం

తగరపువలస: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. చిట్టివలస గణేష్ థియేటర్ వద్ద కార్యాలయంలో లేదా 89193 90993, 77022 94638 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

ఆనందపురం : కుష్ఠు వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కుష్ఠు వ్యాధి నిర్మూలనా కేంద్రం వైద్యాధికారి సత్యవాణి సూచించారు. మండలంలోని నేల్తేరులో ఉన్న కేజీబీవీ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, కను బొమ్మలపై వెంట్రుకలు రాలడం లాంటి లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందికి చూపించాలని చెప్పారు. ఈ సందర్భంగా కుష్ఠు లక్షణాలు తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి సాంబమూర్తి, డిప్యూటీ పారామెడికల్ అధికారి భీమేశ్వరరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 648 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఆనందపురం : విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. భీమిలి మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 648 మంది విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. శొంఠ్యాం ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడలేక విద్యార్థులు మంచి భవిష్యత్తును కోల్పోయారన్నారు. ఈ విషయాలను గ్రహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి నిర్ణయించి నాడు–నేడు, అమ్మ ఒడి కార్యక్రమాలను ప్రవేశ పెట్టారన్నారన్నారు. దీని వలన హాజరు శాతం పెరగడంతో పాటు పరీక్షలలో ఫలితాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక విద్యను అందించాలనే తలంపుతో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్నారని వివరించారు. వీటి వలన విద్యార్థులు త్వరితగతిన పాఠ్యాంశాలను అవగతం చేసుకోవడంతో పాటు ఇంటి వద్ద కూడా పాఠ్యాంశాలను చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. మండలంలో 6215 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి కింద రూ.34 కోట్లు, నాడు–నేడు కార్యక్రమం కింద రూ.18 కోట్లు వ్యయం చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, లెంక రాంబాబు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, నాయకులు కోరాడ ముసిలి నాయుడు, కోరాడ వెంకట రమణా రావు, బొట్టా రామకృష్ణ, నాగేశ్వరరావు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ట్యాబ్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట అంబేడ్కరు హైస్కూల్‌లో శుక్రవారం ఇంగ్లిష్ సబ్జెక్ట్‌పై జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌ను డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ సందర్శించారు. విద్యార్థుల భాషా నైపుణ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇంగ్లిష్‌లో పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగన్నాథస్వామి, తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకుని వస్తున్న అర్చకులు

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం కాపులుప్పాడ చిలుకూరి లేఅవుట్‌లో శుక్రవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముందుగా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా సాయిబాబా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.వి.నర్సింహారావు, ఉపాధ్యక్షుడిగా సి.హెచ్.నర్సింహారావు ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం పలు తీర్మానాలను ప్రకటించారు.

సంక్షేమ సారథిని మళ్లీ దీవించండి

మధురవాడ: గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అన్ని సంక్షేమ పథకాలు లబ్ధిదారుల వద్దకే అందజేస్తున్న సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుఅన్నారు. ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.6వ వార్డు రేవళ్లపాలెం 44వ వార్డు సచివాలయం సౌండ్ అండ్ సౌండ్ లే అవుట్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ..ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. స్థానిక సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ కె.కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి బొట్ట అప్పలరాజు, జేసీఎస్ కన్వీనర్ రోశిరెడ్డి, మాజీ కార్పొరేటర్ సోంబాబు, జిల్లా నాయకుడు పోతిన సూరిబాబు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి